చెల్లపల్లి వేంకటుజోగ్ మల్లికార్జున ప్రసాద్

# దేవుడి ఆరాటం





రఘునాథబాబు చరిత్ర పరిశోధకుడు. ఎక్కడెక్కడి మారుమూల ప్రాంతాలు సందర్శించి, అక్కడి చారిత్రక విశేషాలు అన్వేషించటం అతనికి ఎంతో ఇష్టం. అతడు పరిశోధించి ప్రకటించిన ఎన్నో విషయాలు ఎంతో పేరుప్రతిష్టలు సంపాదించిపెట్టాయి.

అతడు ఎక్కడా ఉద్యోగం చెయ్యటంలేదు. ఉద్యోగం చెయనక్కరలేదు కూడా. కొన్ని లక్షల ఆస్తికి యజమాని. ఉద్యోగంలో తగినంత స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు దొరకవు కాబట్టి తన సేవలు స్వచ్ఛందంగానే అందిస్తున్నాడు రఘునాథబాబు. తన స్వంత ఖర్చులతో అనేక ప్రాంతాలకు వెళ్లి అమూల్య విషయాలు వెలికి తీసే అతడు తన పరిశోధనలో భాగంగా ఒకసారి ఒక మారుమూల ప్రాంతానికి వెళ్ళాడు. చుట్టురా కొండలు, మధ్యలో అడవి. ఫారెస్టు డిపార్టుమెంటు వారికి, అక్కడ నివసించే వారికి తప్ప ఆ ప్రాంతం దాదాపు ఎవరికీ తెలియదు.

ప్రక్కన ఉన్న పట్నంలో ట్రావెలర్స్ బంగళాలో దిగిన రఘునాథబాబు ఉదయాన స్వంత జీపులో ఆ ప్రదేశం పరిశీలించటానికి బయలుదేరాడు. ఎగుడు దిగుడుగా ఉన్న దారిలో జీపు వెళ్తోంది. చుట్టూ ఎత్తుగా పెరిగిన టేకుచెట్లు గాలికి కదులుతున్నాయి. మధ్య మధ్యలో ఆగుతూ, పరిసరాలు జాగ్రత్తగా గమనిస్తూ వెళ్తున్న అతని దృష్టి దూరంగా ఉన్న ఒక ఎత్తైన గుట్టలాంటి దానిమీద పడింది. అటువైపు జీపు కదలింది.

దొంగ: ఒరేయి పెద్దయ్యాక నువ్వు నాకులా పెద్ద పేరు తెచ్చుకోవాలి?
కొడుకు: అలాగే డాడీ
దొంగ: ఏం చేస్తావ్‌చదువుకుంటావా మరి?
కొడుకు: లేదు డాడీ మంత్రి నౌతా.



అది శిథిలావస్థలో ఉన్న దేవాలయం. గుడికి గల ప్రాకారం విరిగి, రాళ్ళు చిందర వందరగా పడివున్నాయి. జీపు ప్రక్కన ఆపి, రఘునాథబాబు అక్కడకు నడిచాడు.

ఆలయం ఆవరణ చక్కగా ఊడ్చి ముగ్గులేసి వుంది. లోనుండి సన్నగా భగవన్నామం స్మరిస్తున్న శబ్దం వినబడుతున్నది. ఇంత నిర్జనమైన ప్రదేశంలో ఎవరో దేవాలయంలో ఉన్నందుకు ఆశ్చర్య పడుతూ అతడు లోపలికి వెళ్లాడు. దాదాపు అరవై సంవత్సరాల వృద్ధుడు తన్మయత్వంతో భగవంతుని కీర్తిస్తున్నాడు. ఆయన వేషధారణ అర్చకుడని సూచిస్తున్నది. రఘునాథబాబు మెల్లగా "స్వామీ!" అని పిలిచాడు.

ఆ పిలుపుతో బాహ్యప్రపంచానికి వచ్చిన ఆయన ఎంతో ఆదరంగా అతనిని ఆహ్వానించాడు. గర్భగుడిలో ఉన్న లక్ష్మీనారాయణుని విగ్రహం చిరుదీపకాంతిలో ప్రశాంతమందహాససుందరంగా ఉన్నది. అమ్మవారు అయ్యవారికి అంక భాగంలో ఉన్నది. స్వామి లక్ష్మీనాథుడే అయినా, అక్కడ మాత్రం శరీర మాత్రవైభవంతోనే నెలకొని ఉన్నాడు.

స్వామికి నమస్కరించి, అర్చకుడు ఇచ్చిన తీర్థం తీసుకొని రఘునాథబాబు కూర్చున్నాడు. ఆయన కూడా వచ్చి ఆసీనుడయిన తర్వాత తన గురించి తాను ముందు చెప్పుకున్నాడు.

"ఇంతటి మారుమూల ప్రదేశంలో మీరు ఎలా ఉంటున్నారు! ఇది కట్టి ఎన్నాళ్ళు అయింది? ఎవరుకట్టారు?" అని తన ఆశ్చర్యాన్ని వెల్లడించాడు.

ఆయన ఈ విధంగా చెప్పసాగాడు.

"నాయనా! కృష్ణామండలంలోని రామచంద్రపుర అగ్రహారంలో నారాయణశాస్త్రి భార్యాపుత్రులతో నివసించేవాడు. తండ్రిగారి నుండి నేర్చిన పాండిత్యంతో తన మంచితనంతో పురోహితునిగా అతని జీవితం సుఖంగా గడచిపోయేది. ఒకసారి కృష్ణాపుష్కరాలకు కుటుంబంతో అతడు విజయవాడ వెళ్లాడు. దైవకృప తిన్నగా లేక అతని కళ్ళముందే అతని భార్యాపుత్రులు నదిలో కొట్టుకుని పోయారు. వారి శవాలు కూడా లభించలేదు. అతని మతిచలించింది. అతడింక తన ఊరు తిరిగి వెళ్ళలేదు. ఎక్కడెక్కడో తిరిగాడు. అలా తిరుగుతూ, చివరకు ఒకనాడు ఈ గుడి దగ్గరకు వచ్చాడు. శిథిలావస్థలో ధూళిదూసరితమైన ఆలయం, అందులో ఏ వైభవానికి నోచుకోని స్వామి.

ఆలయం చూచిన మరుక్షణం అతన్ని అంతవరకు ఆవేశించిన ఏదో మాయాపిశాచం విడిచివెళ్ళినట్లు అనిపించింది. ఎవరి కర్మానుసారం వారు సుఖదుఃఖాలు అనుభవిస్తూ సంసారంలో పరిభ్రమిస్తుంటారని స్వామి భగవద్గీతలో చెప్పాడు. అనంతవిశ్వంలో అనూహ్యమైన కాలగతిలో తాను అనుభవించే దుఃఖం యొక్క పరిమాణం ఎంత? దీనికై పిచ్చివాడై తిరగటం ఎంత వెర్రితనం! ఇలా ఎవరో అతనిని తట్టి మేలుకొలిపినట్లయింది. ఆ క్షణం అతనికి పునర్జన్మవంటిది. అప్పటినుండి అతడు ఆలయం విడిచి వెళ్లలేదు. ఇక జీవితానికి వేరుగమ్యంలేదనీ, స్వామి ఉన్న చోటే తన చోటు అనీ, స్వామిసేవకంటె అన్యమైనది లేదనీ నిశ్చయించుకున్నాడు.


ఆ నారాయణశాస్త్రి ఎవరో కాదు. నేనే. పది సంవత్సరాలుగా నేను ఇక్కడే ఉన్నాను. నాచేతనైంతవరకు ఆలయం బాగుచేశాను. అడవిలోని కాయాకసరూ స్వామికి నివేదన చేసేవాడిని. ఈ ప్రాంతంలో ఉన్న గిరిజనులు, గ్రామప్రజలు నెమ్మదిగా గుడికి రాసాగారు. ఇపుడు వారే రకరకాల పండ్లు స్వామికి సమర్పిస్తుంటారు. నేను వద్దన్నా వినకుండా అభిమానంతో నాకు కావలసిన బియ్యం, వస్తువులు సమకూర్చి పెడతారు. ఇపుడు నాకు ఏ విచారంలేదు. వారి అమాయకత్వం, భక్తిశ్రద్ధలు చూస్తుంటే ఇంత చక్కని ప్రదేశానికి చేరుకున్నందుకు ఎంతో ఆనందం కలుగుతోంది. వారికి భగవంతుని గురించి కథలు చెపుతుంటాను. ఇలా ఈ జీవితంలో స్వామిసేవలో తరించటం కంటె నాకు యే కోరికలు లేవు.

ఇన్నినాళ్ళుగా నా కథ నేను ఎవరికి చెప్పలేదు. నిన్ను చూస్తే తెలియని అభిమానం కలిగి ఇదంతా చెప్పాలనిపించింది. మరి, ఈ ఆలయం ఎవరు కట్టించారో, ఎన్నాళ్ళయిందో నాకు కూడా సరిగా తెలియదు. ఈ ప్రాంతంలోని కొందరు ముసలివారు మాత్రం ఇది అయిదారు వందల సంవత్సరాల పూర్వం కట్టారని, తరువాత ఆ రాజులు, వారి వంశం అంతరించి ఇలా శిథిలమైపోయిందని చెప్తారు" అని నారాయణశాస్త్రిగారు తన కథ ముగించాడు.

రఘునాథబాబు మనస్సు ఒక పవిత్ర భావంతో నిండిపోయింది. ఆయనపై ఎంతో గౌరవం, అభిమానం గోచరిస్తుండగా "స్వామీ! నేను ఇంతవరకు ఎన్నో ప్రదేశాలు నా పరిశోధన కోసం తిరిగాను. కాని, మీవంటి మహనీయుల దర్శన భాగ్యం ఈసారి మాత్రమే దక్కింది" అని నమస్కరించాడు.

"నాయనా! ఈ రోజు నీవు ఇక్కడే ఉండి నా ఆతిథ్యం అందుకోవాలి. ఈ పేదవాని కోరికకు అభ్యంతరం ఉండదనుకొంటాను" అని ఆయన అంటున్నపుడు ఆ ఆత్మీయతకు రఘునాథబాబు మనస్సు పులకరించింది.

భార్య: అత్తయ్యగారు వచ్చాక మనకు ఖర్చు తగ్గిందండి.
భర్త : ఏం ఇంటి పని అంతా అవిడా చేతనే చేపిస్తున్నావా?
భార్య: అదేం కాదు ఆవిడొచ్చాకే మన ఇంటికి చుట్టాలు రావడం మానేశారు అంతే!
భర్త: ఆఁ...



"స్వామీ! నిజం చెప్పాలంటే మీరు అనుమతిస్తే ఈరోజు ఇక్కడే మీ సన్నిధిలో గడపాలని ఇంతకుముందే అనుకొన్నాను. మీరే ఆ భాగ్యం ప్రసాదిస్తే, కాదని కాలదన్నుకో గలనా!" అని వినమ్రుడై పలికాడు.

"బాబూ! ఈ గుడిని బాగుచేసే సమయంలో చుట్టు ప్రక్కల ఎన్నోశిల్పాలు శాసనాలు కనిపించాయి. వాటిని భద్రపరచాను. అవి నీ పరిశోధనకు తప్పక ఉపకరిస్తాయి" అని ఆయన చెప్పాడు.

సాయంత్రమయింది, కొందరు ప్రజలు గుడికి వచ్చారు, వారి సంభాషణలతో కొంతసేపు ఆలయం సందడిగా ఉన్నది. రాత్రినివేదన అయింది. గుడిలో ఒక ప్రక్కగా వెదురుకఱ్ఱలతో కట్టిన ఊయెల వ్రేలాడదీసిఉంది. దానిలో అమ్మవారు, అయ్యవారల విగ్రహాలు ఉన్నాయి.

"చూశావా నాయనా! ఈ ఊయెల ఇక్కడి ప్రజలే కట్టారు. విగ్రహాలు కొయ్యతో చేసి తీసుకు వచ్చారు. అప్పటినుండి స్వామికి రాత్రి పవళింపుసేవ జరిపే భాగ్యం కూడ చేకూరింది." అని ఆయన నెమ్మదిగా ఊయెల ఊపుతూ విసనికఱ్ఱతో విసరసాగాడు.

"స్వామిని ఎంత చూసినా తనివితీరదు. ఎంతసేపు సేవించినా తృప్తి కలుగదు. ఆయన చల్లగా నిద్రిస్తే లోకాలు కూడా చల్లగా నిద్రిస్తాయి. ఇవన్నీ కొందరకు నవ్వు కలిగించవచ్చు. స్వామిని ఊయెలలో ఉంచి ఈవిధంగా సేవిస్తే కాని నిద్రించడా! అనుకోవచ్చు. అనుబంధం, భక్తి పెనవేసుకొన్నపుడు మనంచేసే ఏ చిన్నపని అయినా ఎంతో ఆనందాన్ని, సంతృప్తిని కలిగిస్తుంది. అవి లేనపుడు ప్రతిదీ అర్థరహితంగానే గోచరిస్తుంది.

బిడ్డ ఎంతపెద్దవాడైనా తల్లిపెట్టే అన్నం అతనికి అమృత ప్రాయంగా ఉంటుంది. ఆవిధంగానే తన బిడ్డకు తాను తినిపించటంలో ఆ మాతృమూర్తి పొందే ఆనందం కూడ అనిర్వచనీయంగా ఉంటుంది. తాను పెట్టుకొని అన్నంతినలేడా! లేకుంటే ఎవరైనా పెట్టరా! అంటే, తినవచ్చు, పెట్టవచ్చు. కాని, ఆతృప్తిరాదు. అలాగే, స్వామిని తల్లిగా, తండ్రిగా, నాధునిగా, నెచ్చెలిగా ఇలా ఎన్నో విధాలుగా భావించి సేవించటంలో అంతటి తృప్తి ఉన్నది. అంతటి మనశ్శాంతి ఉన్నది. అది ఆ రకమైన భావపరిణతి లేనివారికి అర్థం కాదు. ఆ విధంగా స్వామిని సేవించే వారికోసం ఆయన కూడ పరుగున వస్తాడు."

నారాయణ శాస్త్రిగారి మాటలు వింటున్న రఘునాధ బాబు మనస్సు ఏవోదివ్యలోకాలలో విహరిస్తోంది.

* * *

రఘునాధబాబు అక్కడి వచ్చినపని వృథా కాలేదు. అతనికి ఎన్నో అమూల్యమైన శిల్పాలు, శాసనాలు గుడి చుట్టుప్రక్కల లభించాయి. వాటి వివరాలు తెలుసుకొంటుంటే అతని మనస్సు ఉప్పొంగిపోయింది.

"స్వామి! నేను గ్రహించిన సమాచారాన్ని, విశేషాలను ప్రభుత్వానికి, పత్రికలకు తెలియజేస్తే, తద్వారా ఈ ప్రాంతానికి విశేష ప్రాచుర్యం కలుగుతుంది.ఆలయంలోని స్వామికి పూర్వవైభవం సిద్ధిస్తుంది. మీరింక ఈ విషయమై నిశ్చింతగా ఉండండి"——అని రఘునాధబాబు తాను బయలుదేరి వెళ్లేనాడు నారాయణశాస్త్రితో చెప్పాడు. ఆయనను విడిచివెళ్తున్న బాధ అతని ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నది.

"నాయనా! ఆ లక్ష్మీనారాయణుడే నిన్ను ఈపనిమీద ఇక్కడకు పిలిపించుకొన్నాడు. ఆయన దేవాలయానికి పూర్వవైభవం చేకూరుతుందంటే అంతకంటె ఆనందమేముంది? వెళ్లిరా, నాయనా!" అని ఆయన సాగనంపాడు.

* * *

రఘునాధబాబు ప్రకటించిన విషయాలు ప్రపంచానికి ఎంతో ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించాయి. ప్రభుత్వం త్రవ్వకాలు జరిపించటంలో ఎంతో ఆసక్తి ప్రదర్శించింది. ఆలయ పునరుద్ధరణకు అతడు స్వయంగా లక్షరూపాయలు విరాళంగా ఇచ్చాడు.

కాలగమనంలో పదేళ్లు గడిచిపోయాయి. ఈ పది సంవత్సరాలలో మరల దేవాలయానికి వెళ్లటం అతనికి సాధ్యపడలేదు. ఇపుడు ఆదేవాలయం పెద్దపుణ్యక్షేత్రంగా మారిపోయింది. ప్రయాణసౌకర్యాలు విస్తారంగా ఏర్పడ్డాయి. అక్కడ పల్లెలన్నీ పట్టణాలుగా రూపుదిద్దుకొన్నాయి.

మరల ఆ రోజు రఘునాధబాబు తీరికచేసుకొని ఆ దేవాలయానికి బయలుదేరాడు. ఇదివరకటి గుడికి పోలికలేదు. ఇపుడు దైవదర్శనానికి అందరు 'క్యూ' పద్ధతి పాటించాలి. ఇష్టంవచ్చినంతసేపు స్వామిని చూడటానికి వీలులేదు. ప్రత్యేకంగా చూడాలంటే తగిన రుసుము చెల్లించాలి. పూజలు చేయించాలన్నా, కొబ్బరికాయ కొట్టాలన్నా కూడా టికెట్ కొనుక్కోవాలి.

దేవాలయం భక్తులతో రద్దీగా ఉంది. రఘునాధబాబుని ప్రత్యేకంగా అధికారులు వెళ్లేద్వారం నుండి లోనికి వెంటబెట్టుకు వెళ్లారు. విద్యుద్దీపాల కాంతిలో ధగధగాయమానంగా సర్వాలంకార భూషితుడై స్వామి లక్ష్మీసమేతుడై ప్రకాశిస్తున్నాడు. నారాయణశాస్త్రిగారి కల ఫలించింది. అక్కడగల అర్చకులలో ఆయనకోసం రఘునాధబాబు కన్నులు వెతికాయి. కాని, ఆయన కనిపించలేదు. దేవాలయ అధికారిని ఆయన గురించి అడిగాడు. ఆ అధికారి తానుక్రొత్తగా వచ్చినకారణంగా పూర్వవిషయాలు తనకు తెలియవని చెప్పాడు. దేవాలయం నుంచి బయటకు వచ్చిన తరువాత కూడఅతడు ఎందరినో అడిగాడు.

"స్వామిసేవలో ఆయన ప్రశాంతంగా తనువు చాలించాడనీ, అది జరిగి కూడా ఏడెనిమిది సంవత్సరాలయింద"ని ఎవరో ముసలమ్మ చెప్పింది.

నారాయశాస్త్రిగారు తానుకోరుకొన్న విధంగానే స్వామిసేవలో తరించిన విషయం విన్న రఘునాధబాబు మనస్సు పరితృప్తి పొందింది.

సాయంత్రం అతడు మరలదేవాలయానికి వెళ్లాడు. ఇపుడు స్వామికి ప్రత్యేకంగా పవళింపు సేవ మందిరం కట్టారు. దానిలో బంగారు ఊయెల వెండి గొలుసులతో వ్రేలాడదీసి ఉంది. రఘునాధబాబు ఆ మందిరంలో నిలబడ్డాడు. ఇంతలో ఒక అర్చకుడు వచ్చి ఊయెల ఒకసారి, వింజామర ఒకసారి ఊపి, ప్రక్కనే ఉన్న ఫ్యాను స్విచ్చివేసి తనపనిపూర్తి అయినట్లుగా వెళ్లిపోయాడు.

స్వామికి అన్నివైభవాలు ఉన్నాయి. ఎన్నో సేవలు జరుగుతున్నాయి. కాని, రఘునాధబాబుకు ఏదో వెలితి గోచరిస్తున్నది.

"అనుబంధం, భక్తి పెనవేసుకొన్నపుడు మనంచేసే ఏ చిన్నపని అయినా ఎంతో ఆనందాన్ని, సంతృప్తిని కలిగిస్తుంది. అవిలేనపుడు ప్రతిదీ అర్థరహితంగానే అనిపిస్తుంది" అన్న నారాయణశాస్త్రిగారి మాటలు రఘునాధ బాబు చెవులలో మారుమ్రోగుతున్నాయి.

తనపని తాను చేస్తూ తిరుగుతున్న ఫ్యాను వైపు చూచి ఊయెలలోని స్వామి కన్నులు నవ్వుతున్నాయి. నారాయణశాస్త్రి వంటివారు ఎవరైనా ఉన్నారేమోనని ఆశగా అన్వేషిస్తున్నాయి. ఆరాటపడుతున్నాయి. ●

లైన్‌మెన్: కరెంటు పోయిందని మీ కాలనీ వాళ్ళు ఎవరు కంప్లైంట్ ఇవ్వలేదు మీరెందుకు చేశారు?

అప్పారావు: మా కాలనీలో టి.వీ. లేని కొంప నాదేనయ్యా.

